సాక్షి
అనంతపురం

సోమవారం ; 8 ఏప్రిల్ ; 2024



ముగిసిన మూల్యాంకనం

అనంతపురం కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరుగుతున్న 'పది' జవాబు పత్రాల మూల్యాంకనం ముగిసింది. 8లో



టమాట కిలో రూ.15

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

సోమవారం	మంగళవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.34	సెహరీ : 4.52



న్యూస్‌రీల్

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల వెల్లువ

- 25 పాఠశాలల్లో 5,137 మంది దరఖాస్తు



జగరాజుపల్లి మోడల్‌స్కూల్

పుట్టపర్తి అర్బన్: ఏపీ మోడల్ స్కూళ్లలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. రాష్ట్ర ప్రభుత్వం 'నాడు–నేడు' కింద వసతులు కల్పించి కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మోడల్ స్కూళ్లను తీర్చిదిద్ది, నాణ్యమైన విద్యనందిస్తోంది. దీంతో ఇక్కడ చేరేందుకు విద్యార్థులు పోటీ పడుతున్నారు. అనంతపురం జిల్లాలో గార్లదిన్నె ,గుత్తి, కళ్యాణదుర్గం, కణేకల్లు, పామిడి, పుట్లూరు, రాప్తాడు, రాయదుర్గం, శెట్టూరు, తాడిపత్రి, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, యాడికి, చిలమకూరులో, శ్రీసత్యసాయి జిల్లాలోని అగళి,అమడగూరు, అమరాపురం , చెన్నేకొత్తపల్లి, ధర్మవరం, హిందూపురం, కనగానపల్లి, దేవిరెడ్డిపల్లి, జగరాజుపల్లి, రామగిరిలో మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో ఆరో తరగతికి 100 సీట్లు కేటాయించారు. మొత్తం 25 పాఠశాలల్లో 2,500 సీట్లకు గాను 5,137 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా రాయదుర్గంలో 485, గుత్తి 471, ధర్మవరం 359, పామిడి 348, గార్లదిన్నె 305, తాడిపత్రి 297, కళ్యాణదుర్గం 281, రాప్తాడు మోడల్ స్కూల్‌కు 271 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 21న ఆయా పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించి అర్హులైన విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు.

ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిద్దాం



సీఐలతో సమీక్షిస్తున్న ఎస్పీ అమిత్ బర్దర్

గుంతకల్లు: సమర్థవంతంగా పనిచేసి ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా చూద్దామని ఎస్పీ అమిత్ బర్దర్ అన్నారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ సీఐలతో సమీక్ష నిర్వహించారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణ కోసం సబ్ డివిజన్ పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీ అమిత్ బర్దర్ దిశానిర్దేశం చేశారు. గత ఎన్నికల్లో జరిగిన ఘటనలు, ప్రస్తుతం ఆ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. చెక్‌పోస్టులు, లాడ్జీలు, ధాబాల్లో తనిఖీలు, వాహన తనిఖీలు, ఫ్లాగ్ మార్చ్‌లు ముమ్మరం చేయాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి, సీఐలు రామసుబ్బయ్య, గణేష్, మహేశ్వర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి గుంతకల్లు రూరల్ ఎస్సై సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



చూడచక్కని బడి: నాడు–నేడుతో రూపురేఖలు మారిపోయిన గుత్తి కోటలోని జెడ్పీ పాఠశాల



ఇట్టే ఆకట్టుకునేలా..: గుమ్మఘట్ట మండలం గలగల ప్రభుత్వ పాఠశాల గోడలపై పిల్లలను ఆకర్షించేలా తీర్చిదిద్దిన బొమ్మలు

కలలోనైన కలగనలేదే..



ఈ బడుల్లో చదివేదంతా పేద పిల్లలే. రోజుకూలి చేసుకునేవారు, వ్యవసాయ కూలీలు, రైతులు తదితర కుటుంబాల వారు తమ పిల్లలను ఇక్కడ చేరుస్తుంటారు. ఇలాంటి స్కూళ్లలో కావాల్సిన సౌకర్యాలు సమకూర్చి పిల్లలు బాగా చదివేలా చూడాల్సిన బాధ్యత ప్రజల ద్వారా ఎన్నికైన ప్రభుత్వానిది. కానీ, గత ప్రభుత్వాలేవీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఎప్పుడో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరినా పట్టించుకోలేదు. పెత్తందారీ అయిన చంద్రబాబు గురించి అయితే చెప్పాల్సిన పనిలేదు. ప్రభుత్వ పాఠశాలలను బాగు చేయలేదు సరికదా.. అసలు విద్య అనేది ప్రభుత్వ బాధ్యతే కాదు అని సెలవిచ్చేశారు. కార్పొరేట్ పాఠశాలలను ప్రోత్సహించారు. వాటికి లబ్ధి చేకూరేలా చేయాల్సిందంతా చేశారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేశారు. కానీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొలువుదీరాక ఆ పరిస్థితి పూర్తిగా మారింది. పేదల సంక్షేమమే తన లక్ష్యమన్న సీఎం జగన్.. ఆచరణలోనూ చేసి చూపించారు. ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ తీసుకొచ్చారు. నాడు–నేడు పథకం ప్రవేశపెట్టి, రూ. కోట్లతో గదులు, టాయిలెట్లు, ఐఎఫ్ ప్యానెళ్లు, బెంచీలు ఇలా ఒకటేమిటి కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా అత్యాధునిక వసతులు సమకూర్చారు. పిల్లలు హాయిగా చదువుకునేలా వాతావరణం నెలకొల్పారు. ఇది నిజంగా ప్రభుత్వ స్కూలేనా? అని అందరూ, తమ బిడ్డలు చదువుకునే పాఠశాలలు ఇలా తయారవుతాయని కలలో కూడా ఊహించలేదని తల్లిదండ్రులు ఆశ్చర్యపడే స్థితికి తీసుకొచ్చారు. సీఎం జగన్ చొరవతో జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లు గతంలో ఎన్నడూ లేని విధంగా సగర్వంగా నిలబడ్డాయి. అందుకు ఈ చిత్రాలే సాక్ష్యాలు..

– సాక్షి నెట్‌వర్క్

వసతులు.. భేష్



రాయదుర్గం పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో మరుగుదొడ్లు



పుట్లూరు మండలం తక్కలపల్లి ప్రాథమిక పాఠశాలలోని మినరల్ వాటర్ ప్లాంట్



ఉరవకొండ ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో హ్యాండ్‌వాష్ సౌకర్యం



పుట్లూరు మండలం తక్కలపల్లి ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు



కార్పొరేట్ కాదందోయ్: అత్యాధునిక సొబగులద్దుకున్న కంబదూరు కస్తూర్బా బాలికల పాఠశాల

జిల్లాలో మనబడి నాడు-నేడు వివరాలు			
	మొదటి విడత	698 స్కూళ్లు	రూ. 189.93 కోట్ల ఖర్చు
	రెండో విడత	1102 స్కూళ్లు	రూ. 163.04 కోట్ల ఖర్చు



స్మార్ట్ చదువులు: ఉరవకొండ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం



ఆటపాటలకు వేదిక: గుత్తి మండలం తొండపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఓపెన్ ఆడిటోరియం



అందమైన బ(గు)డి: బెళుగుప్ప మండలం వెంకటాద్రిపల్లి పాఠశాల ఆవరణలో దేవుళ్లు, స్వాతంత్య్ర సమరయోధుల ప్రతిమలు



స్వాగతమే అదిరిపోయేలా: అనంతపురం మంగళవారికాలనీలో ఆకట్టుకున్న ఝాన్సీలక్ష్మీబాయి ప్రాథమిక పాఠశాలముఖద్వారం



బల్లగుద్ది చెప్పేలా ప్రగతి: పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బల్లలు



భోజనం..రుచికరం: కళ్యాణదుర్గం మండలం హులికల్లు ఉన్నత పాఠశాల ఆవరణలో భోజనం చేస్తున్న విద్యార్థులు

'సన్'డే @ 44.5 డిగ్రీలు

- శింగనమలలో రికార్డు ఉష్ణోగ్రత
- ఉమ్మడి జిల్లాపై నిప్పులు కక్కిన భానుడు
- ప్రజల ఉక్కిరిబిక్కిరి

అనంతపురం అగ్రికల్చర్: భానుడి భగభగలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. నిప్పులు కురిపిస్తూ సూర్య భగవానుడు అందరినీ బెంబేలెత్తిస్తున్నాడు. ఆదివారం శింగనమలలో ఏకంగా 44.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. తాడిపత్రి 43.9 డిగ్రీలు, యాడికి 43.6 డిగ్రీలు, యల్లనూరు 43.4 డిగ్రీలు, పుట్లూరు 43.1 డిగ్రీలు... ఇలా జిల్లా అంతటా సూరీడు మండిపోయి జనానికి ముచ్చెమటలు పట్టించాడు. శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా పరిగి, కదిరి, ఎన్‌పీ కుంటలో 43.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. కనగానపల్లి 42.9 డిగ్రీలు, చెన్నేకొత్తపల్లి 42.8 డిగ్రీలు, తలుపుల, పెనుకొండ, ధర్మవరంలో 42.7 డిగ్రీలు... ఇలా జిల్లా అంతటా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా 21 నుంచి 27 డిగ్రీల మధ్య నమోదవుతుండటంతో రాత్రిళ్లు ఉక్కపోత బాగా పెరిగింది. ఉష్ణోగ్రతలకు తోడు వడగాల్పులు అన్ని వర్గాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

జాగ్రత్తలు తప్పనిసరి..

మరికొన్ని రోజులు ఉష్ణోగ్రతలు ఇలానే నమోదు కావచ్చని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సహదేవరెడ్డి, డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకపోవడం మంచిదని పేర్కొన్నారు. తరచు మంచినీళ్లు, నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరినీళ్లు, బియ్యంనీరు (తోరణి), లస్సీ, ఓఆర్‌ఎస్, గ్లూకోజ్, పండ్లరసాలు లాంటివి తీసుకోవాలన్నారు. గొడుగు, టోపీ లాంటివి, అలాగే వదులుగా ఉండే లేతరంగు కాటన్ దుస్తులు ధరించాలన్నారు. సూర్యకాంతి నేరుగా శరీరంపై పడకుండా కళ్లజోడు, చేతిరుమాలు లాంటివి రక్షణగా వేసుకోవాలని తెలిపారు. దుద్దుర్లు, తిమ్మిర్లు, బలహీనత, మైకం, తలనొప్పి, వికారం, చెమటలు, మూర్ఛలు లాంటి సంకేతాలను ముందస్తుగా గుర్తించి తగిన వైద్యసలహాలు తీసుకుంటే వడదెబ్బ నుంచి కాపాడుకోవచ్చన్నారు. పని ప్రదేశాల్లో రైతులు, శ్రామికులు మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఏవైనా పనులుంటే ఉదయం, సాయంత్రానికి మార్చుకోవాలన్నారు.



అనంతపురంలో ఆదివారం ఎండలో ఇబ్బంది పడుతూ వెళ్తున్న ఓ ట్రాక్టర్ డ్రైవర్

అందరి సహకారంతోనే ప్రశాంత ఎన్నికలు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ఉరవకొండ: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపు నిచ్చారు. ఆదివారం ఉరవకొండలో ఆయన పర్యటించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం, స్ట్రాంగ్‌రూంలను, ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉరవకొండ, వజ్రకరూరు మండలాలకు చెందిన పీఓ, ఏపీఓల శిక్షణ తరగతులను పరిశీలించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 'ఎన్నికలు అతి పెద్ద పండుగ, దేశానికే గర్వకారణం' అనే పదాలతో రూపొందించిన భారీ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటు ఆవశ్యకతపై కుటుంబ సభ్యులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. జాయింట్ కలెక్టర్, ఉరవకొండ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్ మాట్లాడుతూ 'స్వీప్' ద్వారా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నామన్నారు. ఎన్నికల విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదన్నారు. కార్యక్రమంలో గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి ఏఈఆర్‌ఓ శిరీష, తహసీల్దార్ శ్రీనివాసులు,ఎంపీడీఓ అమృతరాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ సూచనలు పాటించాలి..

ఎన్నికల కమిషన్ సూచనలు తు.చ తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఉరవకొండ ఎంపీడీఓ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులు, తహసీల్దార్లు, పోలీసు యంత్రాంగంతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సన్నద్ధతలో ఎక్కడా లోటుపాట్లు ఉండరాదన్నారు. అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి

గుంతకల్లు రూరల్/టౌన్: ఎన్నికల విధులు చిత్తశుద్ధితో నిర్వర్తించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం గుంతకల్లు పట్టణంలో ఆయన పర్యటించారు. మార్కెట్ యార్డులో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలిచ్చారు. అనంతరం మున్సిపల్ బాలుర హైస్కూల్‌లో పీఓ, ఏపీఓలకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ఎన్నికల్లో ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జేసీ కేతన్ గార్గ్, ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి, తహసీల్దార్ శేషఫణీ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

స్కూల్ పిల్లల్లా అబద్ధాలు చెబితే ఎలా?

ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అధికారులు సీరియస్‌గా పనిచేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సెక్టార్–4 ఆఫీసర్ అయిన మండల ఇంజినీర్ ఓబులేసు సమావేశానికి హాజరుకాకపోవడంపై గుంతకల్లు తహసీల్దార్ శేషఫణి, పీఆర్ డీఈ మురళీతో కలెక్టర్ ఆరాతీశారు. ఓబులేసు ఎందుకు రాలేదని ప్రశ్నిస్తే ఒకరిపై ఒకరు చెప్పుకున్నారు. దీంతో జిల్లా కలెక్టర్ వారిరువురికి క్లాస్ తీసుకున్నారు. 'మీ మధ్య అవగాహనా లోపం ఉందని తెలుస్తోంది. నిజంగా ఏదైనా ఆరోగ్య సమస్య వల్ల రాలేదా? అనుమతి తీసుకున్నాడా? లేదా? అంటే సమాధానం లేదు. స్కూల్ పిల్లల మాదిరి ఒకరిపై మరొకరు చెప్పుకుంటున్నారు. జిల్లా కలెక్టర్‌కు అబద్ధం చెప్పే ధైర్యముందా?' అంటూ అసహనం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోవాలని హితవు పలికారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో ఎస్పీ అమిత్ బర్దర్, జేసీ కేతన్‌గార్గ్



వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

వజ్రకరూరు: స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం వజ్రకరూరు మండలం కొనకొండ్లలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌తో కలిసి ఆయన పర్యటించారు. పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. స్థానికులతో మాట్లాడారు. ఓటు హక్కు కలిగి ఉన్నారా? జాబితాలో పేర్లు చూసుకున్నారా? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు విలువైనదని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వెంటనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కుమార్ అనే వ్యక్తి పింఛన్ రావడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అర్హత ఉంటే తప్పక న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ కేతన్‌గార్గ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన పది మూల్యాంకనం

అనంతపురం ఎడ్యుకేషన్: ఈనెల 1న ప్రారంభమైన పదో తరగతి వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఆదివారంతో ముగిసింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 1.81 లక్షల జవాబు పత్రాలు వచ్చాయి. డీఈఓ వరలక్ష్మి పర్యవేక్షణలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ ఆధ్వర్యంలో అన్ని వసతులు కల్పించారు. ఈ సందర్భంగా డీఈఓను ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు. అందరి సమష్టి కృషితోనే జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు, మూల్యాంకన ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి డీఈఓ కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌టీఏ హర్షం: పదో తరగతి మూల్యాంకనం దిగ్విజయంగా పూర్తి చేసినందుకు వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) రాష్ట్ర, జిల్లా శాఖల పక్షాన హర్షం వ్యక్తం చేశారు. డీఈఓ, సిబ్బంది, మూల్యాంకనం పూర్తిచేసిన ఉపాధ్యాయులను వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ రెడ్డి, నాయకులు గోవిందరెడ్డి, రాధాకృష్ణ, రమణ, జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గౌడ్ అభినందించారు.

లయన్స్‌క్లబ్‌కు అవార్డులు



అవార్డు అందుకుంటున్న మల్లికార్జున

ఉరవకొండ: గత ఆర్థిక సంవత్సరానికి (2022–23)కి గాను ఉరవకొండ లయన్స్ క్లబ్‌కు అవార్డులు దక్కాయి. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో ఆదివారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంతో మొత్తం 9 మంది సభ్యులతో పాటు మరోనాలుగు ఉత్తమ పురస్కారాలను క్లబ్ దక్కించుకుంది. ఈ మేరకు క్లబ్ అధ్యక్షుడు జయకృష్ణ తెలిపారు. జిల్లా గవర్నర్ జీఆర్ చంద్రప్రకాష్‌రావు చేతుల మీదుగా అవార్డులు అందుకున్న వారిలో మల్లికార్జున, గణేష్‌బాబు, కొమ్మసాని బాలచంద్ర, చిట్టా శ్రీధర్, ప్రభాకరనాయుడు, జయకృష్ణ, నాగేశ్వరరావు, మిడతల విశ్వనాథ్, జీకే శ్రీధర్ ఉన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాల నుంచి తప్పించుకుపోయిన బాలుడి ఆచూకీని 24 గంటల్లోపు పసిగట్టి తల్లిదండ్రుల చెంతకు బీకేఎస్ పోలీసులు చేర్చారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు... ఎస్టీ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న గౌతమ్ శనివారం బాత్రూమ్‌కు వెళ్లివస్తానని చెప్పి తప్పించుకుని వెళ్లాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన ఆ పాఠశాల ప్రిన్సిపాల్ దుంగావత్ హరిజీనాయక్ ఫిర్యాదు మేరకు అప్రమత్తమైన పోలీసులు వెంటనే బాలుడి కోసం గాలింపు చేపట్టారు. బత్తలపల్లి మండలం చెర్లోపల్లిలో స్నేహితుడు వద్ద ఉన్న బాలుడిని గుర్తించి, ఆదివారం తల్లిదండ్రులకు అప్పగించారు.

కసాపురంలో ఉగాది ఉత్సవాలు

- రేపటి నుంచి ప్రారంభం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం ఉగాది ఉత్సవాలకు ముస్తాబైంది. మంగళవారం నుంచి క్రోధి నామ సంవత్సర ఉగాది ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో వారి సౌకర్యార్థం ఆలయ అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. బెంగుళూరు నుంచి తెప్పించిన ప్రత్యేక పుష్పాలతో ప్రాంగణం మొత్తం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణం, గంగా నిలయం వద్ద చలువ పందిళ్లు వేశారు. ప్రధాన గోపురం ఎదుట ఉన్న రెండు పార్కులను సుందరీకరించారు. గుంతకల్లు మున్సిపాలిటీ నుంచి నిరంతరంగా నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకున్నారు. మూడు రోజుల పాటు ఆలయ ప్రాంగణలో వేర్వేరుగా రెండు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ప్రత్యేక క్యూలైన్లతో పాటు అదనపు ప్రసాద వితరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

9న గ్రామోత్సవం..

ఉగాది ఉత్సవాలలో భాగంగా ఈ నెల 9న తొలిరోజు గ్రామోత్సవం ఉంటుంది. సీతారామ లక్ష్మణ సహిత అంజనేయస్వామి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామంలోని శమీ వృక్షం వరకూ గ్రామోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ముఖ మంటపం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై పంచాంగ శ్రవణం ఉంటుంది. ఆలయ వేద పండితులు పంచాంగాన్ని చదివి క్రోధి నామ సంవత్సర ఫలాలను వినిపించనున్నారు.



నెట్టికంటి ఆంజనేయస్వామి మూలవిరాట్



ఉత్సవాలకు సిద్ధమైన ఆలయం

10న రథోత్సవం..

ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 10వ తేదీ స్వామివారి రథోత్సవం ఉంటుంది. అలాగే ఈ నెల 11న లంకా దహనం కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించనున్నారు. దాదాపు రెండు గంటల పాటు జరిగే లంకాదహనం ఉత్సవాన్ని చేసేందుకు భారీ సంఖ్యలో భక్తులు హాజరు కానున్న నేపథ్యంలో అందుకు తగిన విధంగా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ భద్రాజీ తెలిపారు.

శింగనమల మళ్లీ వైఎస్సార్‌సీపీదే



ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ నివాసంలో సమావేశమైన శింగనమల నియోజకవర్గ నాయకులు

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తాం
- వైఎస్ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడమే కర్తవ్యం
- శింగనమల నియోజకవర్గ నాయకుల వెల్లడి

శింగనమల: నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని, అందరూ కలసికట్టుగా ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులును అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం అనంతపురంలోని ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ నివాసంలో శింగనమల నియోజకవర్గ నాయకుల ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశానికి అనంతపురం ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకట్రామిరెడ్డి, శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర ప్రభుత్వ విద్యాసలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు రమేష్‌రెడ్డి హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, గార్లదిన్నె నారాయణరెడ్డి, గువ్వల రాజశేఖర్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు తరిమెల వంశీగోకుల్‌రెడ్డి, నాగలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా అందరూ కలసికట్టుగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పార్టీ ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేలా కార్యాచరణ రూపొందించారు.

1,037 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాల పంపిణీ

అనంతపురం అగ్రికల్చర్: పాడి రైతులు, గొర్రెల కాపర్ల సంక్షేమానికి జగన్ సర్కారు ప్రాధాన్యత ఇస్తోంది. ప్రధానంగా గడ్డికొరత నివారణకు దాణామృతం (టోటల్ మిక్స్‌డ్ రేషన్ –టీఎంఆర్) గడ్డితో పాటు పశుగ్రాసం పెంపకానికి హైబ్రీడ్ రకం జొన్న విత్తనాలు (ఫాడర్ సీడ్), అలాగే మేత వృథా కాకుండా చాఫ్‌కట్టర్స్ (గడ్డి కత్తిరించే యంత్రాలు) అందిస్తోంది. అర్హత కలిగిన రైతులకు ఈ ఏడాది ఆర్‌బీకే వేదికగా 60 శాతం సబ్సిడీతో 895 మెట్రిక్ టన్నుల టీఎంఆర్ గడ్డి, 75 శాతం సబ్సిడీతో 142 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలు... మొత్తం 1,037 మెట్రిక్ టన్నులు అందించడంతో పాటు 2 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన 110 చాఫ్‌కట్టర్లనూ సకాలంలో రైతులకు పంపిణీ చేశారు. వీటి పూర్తి విలువ రూ.1.94 కోట్లు కాగా రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద రూ.83 లక్షల మేర చెల్లించినట్లు పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు.

'దుర్గం'లో అర్ధరాత్రి అలజడి

- సుమోలో గుర్తుతెలియని దుండగుల సంచారం
- మచ్చు కత్తులు, కర్రలు ఇతర మారణాయుధాలతో హల్‌చల్
- కాలనీ వాసులు గుర్తించడంతో పరారీ
- వెంబడించిన వారిపై రాళ్లు రువ్వి కత్తులు చూపిన వైనం

రాయదుర్గం: రాయదుర్గం– అనంతపురం ప్రధాన మార్గంలోని కోతిగుట్ట, డ్రైవర్స్ కాలనీల్లో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు అలజడి సృష్టించారు. అడ్డుకోబోయిన స్థానికులకు మారణాయుధాలు చూపి రాళ్లు రువ్వారు. అక్కడి నుంచి చాకచక్యంగా తప్పించుకుని ఉడాయించారు. స్థానికులు తెలిపిన మేరకు.. శనివారం రాత్రి 10 గంటలు దాటాక అనంతపురం వైపు నుంచి వచ్చిన ఓ సుమో కోతిగుట్టలో ఆగింది. అందులో దాదాపు ఎనిమిది మంది యువకులు ఉన్నారు. ఇద్దరు యువకులు డ్రైవర్స్ కాలనీలోకి వెళ్లే దారిలో కాపు కాస్తూ కూర్చొన్నారు. అదే సమయంలో కొత్తవారిని గమనించిన స్థానికులు కొందరు చీకట్లో ఇక్కడెందుకు ఉన్నారంటూ ప్రశ్నించారు. ఆ సమయంలో 'మీ పనేదో మీరు చూసుకోండి, అనవసరమై విషయాల్లో తలదూర్చొద్దు' అని ఆ యువకులు దబాయించారు. దీంతో విషయాన్ని స్థానికులకు తెలపడంతో మరింత మంది పోగయ్యారు. విషయాన్ని గమనించిన దుండగులు కొద్ది దూరంలో ఆగిన సుమోలోని మిగిలిన వారికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అందరూ ఓ చోటకు చేరడంతో భయపడి స్థానికులు ఇళ్లలోకి వెళ్లిపోయారు. అనంతరం దుండగులు సుమోను డ్రైవర్స్ కాలనీ వైపు మళ్లించారు. ఈ నేపథ్యంలో స్థానిక యువకులు కొందరు వెంటబడ్డారు. అంతలోనే విధులు ముగించుకుని రూమ్‌కు వెళుతున్న ఓ పోలీస్ అధికారి పరిస్థితిని గమనించి, దుండగులను పట్టుకునేందుకు స్థానికుల వెంటే పరుగెత్తారు. డాబా వద్దకు చేరుకోగానే సుమోను దారిలో ఆపి మచ్చుకత్తులు చూపించారు. అంతటితో ఆగకుండా రాళ్లురువ్వారు. తప్పించుకునే క్రమంలో పోలీసు అధికారి సెల్‌ఫోన్ ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, విషయం తెలుసుకున్నారు. డ్రైవర్స్ కాలనీ, కోతిగుట్ట ప్రాంతాల్లో గస్తీ నిర్వహించారు. అప్పటికే సుమో ఆ ప్రాంతం నుంచి తప్పించుకుని వెళ్లిపోయింది. డ్రైవర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఎవరో ఓ వ్యక్తిని హతమార్చేందుకే కిరాయి హంతకులు వచ్చి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అర్బన్ సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ.. సుమోలో వచ్చిన వ్యక్తులు ఎవరనే దానిపై ఆరా తీస్తున్నామన్నారు. వచ్చిన వారు చిల్లర దొంగలై ఉంటారనే అనుమానాలు వ్యక్తం చేశారు.

టీడీపీ నేతపై కేసు నమోదు

అనంతపురం: టీడీపీ నేత జయరాంనాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆదివారం ఉదయం అనంతపురం వన్‌టౌన్ పోలీసులు టీవీ టవర్ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఆటోను అడ్డుకుని పరిశీలించారు. అందులో జయరాంనాయుడు ఫొటోలు ముద్రించిన బ్యాగ్‌ల్లో నిత్యావసర సరుకులను రంజాన్ తోఫా పేరుతో పంపిణీ చేస్తున్నట్లుగా గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఎంసీసీ ఉల్లంఘన కింద జయరాంనాయుడితో పాటు బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్, శశాంక్‌పై కేసు నమోదు చేశారు. ఆటోతో పాటు నిత్యావసర సరుకులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



రంజాన్ తోఫా బ్యాగులను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

ఈవీఎంలకు 42 ఏళ్లు



ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్

మీకు తెలుసా?

రాయదుర్గం టౌన్: స్వతంత్ర భారతావనిలో ఎన్నికలను తొలుత పేపర్ బ్యాలెట్ ద్వారా నిర్వహించేవారు. అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)ను ప్రవేశపెట్టారు. 1952లో దేశంలో తొలిసారిగా బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. 1982లో వచ్చిన ఈవీఎం యంత్రాలతో ఎన్నికల నిర్వహణ, ఓటింగ్ విధానం సులువైంది. ఈవీఎంలు అందుబాటులోకి వచ్చి 42 ఏళ్లు దాటింది. ఈవీఎంల ద్వారా పోలింగ్ సమయం ఆదాతో పాటు ఓట్ల లెక్కింపు శరవేగంగా ఉంటోంది.

- తొలిసారిగా 1982లో కేరళ రాష్ట్రం పరూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎంలను వినియోగించారు.
- 1982–83లో జరిగిన ఉప ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 10 నియోజకవర్గాల్లో ఈవీఎంల ద్వారా ఓటు హక్కును ప్రజలు వినియోగించుకున్నారు.
- 1984, ఆగస్టులో ఈవీఎంలను వినియోగించరాదంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 1988, డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం సెక్షన్ 81–ఏను ప్రజాప్రాతినిధ్య చట్టంలో చేర్చింది. ఈ సవరణ అనంతరం పరిశీలన తర్వాత ఈవీఎంలతో ఓటింగ్ ప్రక్రియను సుప్రీంకోర్టు సమర్థించింది.
- 1990లో సాంకేతిక నిపుణుల కమిటీ ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)ల వాడకాన్ని సిఫారసు చేసింది.
- 1998లో ఈవీఎంల వాడకంపై ప్రజామోదం లభించింది.
- 1999–2004 మధ్యలో వివిధ రాష్ట్రాలకు జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఈవీఎంలను పూర్తి స్థాయిలో వాడారు.
- 2013 నాగాలాండ్‌లోని నాక్సెస్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో వీవీ ప్యాట్‌లను (ఓటర్ వెరిఫయేబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) మొదటిసారిగా వాడారు.
- 2013లో సుప్రీంకోర్టు దశలవారీగా వీవీ ప్యాట్లను వినియోగంలోకి తేవాలని ఆదేశించింది.

ద్విచక్ర వాహనదారు సజీవ దహనం



నరేష్ (ఫైల్)

పెద్దవడుగూరు : రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే సజీవ దహనయ్యాడు. పెద్దపప్పూరు మండలం తురకపల్లికి చెందిన ముచ్చుకోట నరేష్ (35) ఆదివారం వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనంలో గుత్తికి చేరుకున్నాడు. పని ముగించుకున్న అనంతరం తిరుగు ప్రయాణమైన ఆయన పెద్దవడుగూరు మండలం వీరేపల్లి సమీపంలో డీజిల్ అయిపోయి రోడ్డు పక్కనే ఆపి ఉన్న లారీని ఢీకొన్నాడు. ప్రమాదం జరిగిన వెంటనే ద్విచక్ర వాహనం నుంచి మంటలు ఎగిసిపడి నరేష్‌ను చుట్టుముట్టాయి. మంటలు ఆర్పేందుకు స్థానికులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అందరూ చూస్తుండగానే సజీవ దహనమయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, నరేష్‌కు భార్య లలిత, ఇద్దరు సంతానమున్నారు.

దగ్గుపాటి ఏనాడైనా ప్రజల్లో ఉన్నాడా?


- అనంతపురం ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శంకరనారాయణ, అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచన దగ్గుపాటి ప్రసాద్ ఏనాడైనా ప్రజల మధ్యలో ఉన్నాడా అని అనంతపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ ప్రశ్నించారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు టీడీపీకి అభ్యర్థులు దొరక్క హైదరాబాద్‌లో స్థిరపడి వ్యాపారం చేసుకుంటున్న దగ్గుపాటి ప్రసాద్‌ను తెచ్చి పోటీలో దించారని విమర్శించారు. ఆదివారం అనంతపురంలోని 32వ డివిజన్‌లో విద్యుత్‌నగర్, ఆదర్శనగర్, సెవెన్‌హిల్స్ కాలనీల్లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చేపట్టిన ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... 14 ఏళ్లుగా సీఎంగా ఉన్న చంద్రబాబు పేరు చెబితే గుర్తుకు వచ్చే ఒక్క పథకమూ లేదన్నారు. అనంతపురం నియోజకవర్గంలో ఏనాడు ప్రజల బాగోగుల గురించి పట్టించుకోని వ్యక్తిని తీసుకువచ్చి అభ్యర్థిగా పెట్టడం సిగ్గుచేటన్నారు. ఓట్లు కొనాలనే ఆలోచనతోనే ఎన్ని ట్రిక్కులు చేసినా..ప్రలోభాలకు గురి చేసినా ఓటర్లు ఇప్పటికే వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని ఫిక్స్ అయ్యారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మరోసారి వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ విజేత 'బళ్లారి'



విజేత ట్రోఫీని అందుకుంటున్న బళ్లారి జట్టు

గుత్తి: స్థానిక కాలువ గడ్డ ఆంజనేయస్వామి క్రీడా మైదానం వేదిగా జరుగుతున్న యునైటెడ్ చాంపియన్స్ స్టేట్ లెవెల్ క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. టోర్నీ విజేతగా బళ్లారి బ్లాస్టర్స్ జట్టు నిలిచింది. ఆదివారం ఫైనల్‌లో అనంతపురం ఆర్డీటీ జట్టుపై తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన బళ్లారి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 159 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన అనంతపురం జట్టు 15.5 ఓవర్లలో 109 పరుగుల వద్ద చతికిల పడింది. 50 పరుగుల తేడాతో బళ్లారి బ్లాస్టర్స్ జట్టు ఘన విజయం సాధించింది. విజేతలకు ముఖ్య అతిథులు గేట్స్ కాలేజీ ఎండీ రఘునాథరెడ్డి, సోయబ్ స్టీల్స్ అధినేత షెక్షావలి, పులికొండ బహుమతులు, ట్రోఫీలు ప్రదానం చేశారు. నగదు పురస్కారాలతో సత్కరించారు. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డును బళ్లారి క్రీడాకారుడు చిరంజీవి దక్కించుకున్నారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు శ్రీనివాసబాబు, రాఘవేంద్ర, ఆర్.కుమార్, జోషి, సురేష్‌బాబు, భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేరం దాచేస్తే కుదరదు!

- ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు వారిపై ఉన్న కేసుల వివరాలు తప్పక ప్రకటించాలి
- ఫారం–26 అఫిడవిట్ అసంపూర్తిగా ఉంటే తిరస్కరణ
- ఎన్నికల ఖర్చుకు బ్యాంక్ ఖాతా తప్పనిసరి



అనంతపురం అర్బన్: నేరచరిత్ర కలిగిన అభ్యర్థులు... వాటి వివరాలను పత్రికలు, టీవీల్లో విధిగా ప్రకటించడంతో పాటు వాటి వివరాలను కేంద్ర ఎన్నికల సంఘానికి తప్పనిసరిగా సమర్పించాలి. ఈ మేరకు 2015లో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులపై ఉన్న కేసులు, గత నేర చరిత్రను ఓటర్లు, ప్రజలకు తెలియాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నేరచరిత్ర కలిగిన అభ్యర్థులు విధిగా అందుకు సంబంధించిన వివరాలను వార్తా పత్రికలు, టీవీల ద్వారా మూడు సందర్భాల్లో ప్రకటించాలి. ఈ ప్రకటనలకు సంబంధించి నిర్దిష్ట గడువులనూ కేంద్ర ఎన్నికల సంఘం విధించింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం నాలుగు రోజుల్లో మొదటి దఫా, ఐదు నుంచి ఎనిమిదో రోజు మధ్య మరో విడత, తొమ్మిదో రోజు నుంచి ప్రచారం చివరిరోజు మధ్య మూడో దఫా ప్రకటన ఇవ్వాల్సి ఉంటుంది. అటు రాజకీయ పార్టీలు కూడా నేర చరిత్ర కలిగిన అభ్యర్థుల వివరాలను విధిగా ప్రకటించాల్సిందే. సదరు అభ్యర్థులపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు, వాటి వివరాలు, తదితరాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పార్టీలు తమ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలి. కేసులు, నేరచరిత్ర ఉన్నప్పటికీ ఆ అభ్యర్థులను ఎందుకు ఎంపిక చేయాల్సి వచ్చిందో ఆ కారణాలను కూడా రాజకీయ పార్టీలు తెలపాలి. అభ్యర్థులను ప్రకటించిన 48 గంటల్లోపు, నామినేషన్ల దాఖలు మొదటి రోజుకు రెండు వారాల ముందు ఆయా వివరాలతో కూడిన నివేదికను 72 గంటల్లోపు కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించాలి.

అన్నింటా అఫిడవిట్ కీలకం..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి నామినేషన్‌తోపాటు అఫిడవిట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇదే అత్యంత కీలకం. 1961 ఎన్నికల నిబంధనకు లోబడి 'రూల్–4ఏ' కింద నిర్దేశించిన ఫారం–26 రూపంలో అభ్యర్థులు అఫిడవిట్ సమర్పించాలి. అందులో అభ్యర్థులకు సంబంధించిన అన్ని వివరాలతోపాటు ఆస్తులు, అప్పుల వివరాలు పొందుపర్చాలి. అభ్యర్థితోపాటు కుటుంబసభ్యులకు చెందిన వివరాలూ ఇవ్వాలి. మారిన నిబంధనల మేరకు గడచిన ఐదేళ్ల ఆస్తుల వివరాలు ప్రకటించాలి. ఏవైనా కేసులు ఉన్నా, గతంలో శిక్ష పడినా అందుకు సంబంధించిన వివరాలు పొందుపరచాలి. వాస్తవాలు దాచి అందులో తప్పుడు సమాచారం ఇస్తే అనర్హత వేటు ఎదుర్కోక తప్పదు. నామినేషన్ చివరి రోజు మధ్యాహ్నం 3 గంటల్లోపు సమర్పించే ఫారం –26లోని అన్ని వరుసలనూ తప్పనిసరిగా నింపాలి. లేదంటే అఫిడవిట్ తిరస్కరణకు గురవుతుంది.

బ్యాంక్ ఖాతా తప్పనిసరి..

ఆర్‌పీ చట్టం 1951లోని సెక్షన్ 77 ప్రకారం ఎన్నికల వ్యయాన్ని పర్యవేక్షించేందుకు ప్రతి అభ్యర్థి ప్రత్యేకంగా బ్యాంక్ ఖాతాను తెరవాలి. నామినేషన్ పత్రాలు దాఖలు చేయాలనుకున్న తేదీకి కనీసం ఒక రోజు ముందు అభ్యర్థి పేరు మీద కానీ లేదా, అతని ఎన్నికల ఏజెంట్‌తో ఉమ్మడి పేరుపై ఖాతాను తెరవవచ్చు. ఖాతా సంఖ్యను నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఆర్‌ఓకి లిఖితపూర్వకంగా తెలపాలి. ఎన్నికల ఖర్చు పూర్తిగా ఈ ఖాతా నుంచే చేయాలి. ఫలితాలు ప్రకటన తరువాత, ఖాతా స్టేట్‌మెంట్‌ను దాఖలు చేసే సమయంలో ఖర్చుల ఖాతా స్టేట్‌మెంట్‌తో పాటు బ్యాంక్ ఖాతా స్టేట్‌మెంట్‌కు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని జిల్లా ఎన్నికల అధికారికి ఇవ్వాలి. పారదర్శకత, జవాబుదారీతనం దృష్ట్యా అభ్యర్థులు నగదు రూపంలో విరాళాలు, రుణం స్వీకరించకూడదు. ఇందుకు సంబంధించి చెక్ లేదా డ్రాఫ్ట్ కానీ ఖాతా బదిలీ ద్వారా అందుకోవచ్చు. విరాళాలు, రుణాలు ఇచ్చే వ్యక్తుల పేరు, చిరునామా రోజువారీగా సమర్పించే లెక్కల్లో నమోదు చేయాలి.

హామీ ఇచ్చాం.. నెరవేర్చాం

- పేరూరు డ్యాంకు నీరిచ్చిన ఘనత మాదే
- త్వరలో బంగారు గనులు తెరిపించేందుకు చర్యలు
- దోచుకుని దాచుకోవడమే పరిటాల కుటుంబం నైజం
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


ప్రజలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: 30 ఏళ్లుగా చుక్కనీరు లేక కళ తప్పిన పేరూరు డ్యాంకు కృష్ణా జలాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీదే అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గంతిమర్రి, కలికివాండ్లపల్లి, పెనుబోలు, పి.కొత్తపల్లి, ఏడుగురాకులపల్లి, పేరూరు గ్రామాల్లో హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మతో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిటాల కుటుంబం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. దోచుకుని, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో మాత్రం గ్రామాల్లోకి వచ్చి మేం అధికారంలోకి వస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ ప్రజలను మభ్యపెడుతూ రెచ్చగొడుతున్నారన్నారు. గత టీడీపీ పాలనలో డ్వాక్రా, రైతుల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసిన చరిత్ర వారికే దక్కుతుందన్నారు. అయితే గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను నెరవేర్చిందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనటువంటి సచివాలయ, వలంటర్ వ్యవస్థను సీఎం జగన్ ప్రవేశపెట్టారన్నారు. ప్రతి నెలా ఉదయాన్నే పింఛన్లు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే రామగిరి, కనగానపల్లి మండలాల్లో సోలార్‌ప్లాంట్లకు రైతులు భూములిచ్చారని తెలిపారు. త్వరలోనే ఈ ప్రాంతాల్లో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి 7,000 మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. అంతేకాక రామగిరి బంగారు గనులు తెరిపించేందుకు సన్నాహకాలు పూర్తి అయ్యాయని, త్వరలోనే గనులు తెరిపించి ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో చంద్రబాబు కూటమి మాయమాటలు చెప్పి ప్రజలను మోసగించేందుకు మరోసారి వస్తోందన్నారు. వీరి మాటలు నమ్మి గతంలో ఎన్ని ఇబ్బందులు పడ్డామో గుర్తు చేసుకోవాలన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మైనార్టీల సంక్షేమమే ధ్యేయం

రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాలతో పాటు మైనార్టీల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి పేరూరు మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మైనార్టీలకు పెద్దపీట వేసి ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి పదవులు కట్టబెట్టారని తెలిపారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లో జరిగిన ప్రచారంలో గ్రామస్తులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీనియర్ నాయకురాలు గంగుల భానుమతి, ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీలు నాగార్జున, మారుతి, మండలకన్వీనర్ క్రాహను మంతరెడ్డి, సర్పంచ్‌లు రాజేష్, మీనుగనాగరాజు, సిద్ధన్న, చెన్నకేశవరెడ్డి, నరేంద్ర, ఓబిరెడ్డి, మండల కో–ఆప్షన్ మెంబర్ ముజుబుర్, నాయకులు నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, మల్లికార్జున, దాసరి మోహన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల ప్రచారం

ఆత్మకూరు: మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూజారి లక్ష్మీనరసింహులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పక పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తాం

- ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు అనంత, శంకర నారాయణ


ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకర నారాయణ

అనంతపురం కార్పొరేషన్: తమ ప్రభుత్వంలో ప్రజలకు రెట్టింపు సంక్షేమం అందడంతో పాటు భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం ఎంపీ అభ్యర్థి శంకర నారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్ర రెడ్డితో కలసి నగరంలోని 32వ డివిజన్ పరిధిలోని విద్యుత్ నగర్, ఆదర్శనగర్, సెవెన్‌హిల్స్ కాలనీల్లో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామన్నారు. ఇచ్చిన హామీల ప్రకారం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో రెట్టింపు సంక్షేమం, అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రూ.2,304 కోట్ల సంక్షేమం, రూ.1,045 కోట్ల అభివృద్ధి చేశామన్నారు. అందుకు సంబంధించి అమ్మఒడి రూ.93.39 కోట్లు, విద్యా దీవెన–వసతి దీవెన రూ.73.59 కోట్లు, వైఎస్సార్ చేయూత రూ.89.98 కోట్లు, వెస్సార్ ఆసరా రూ.77.36 కోట్లు, వైఎస్సార్ పింఛన్ కానుక రూ.403.98 కోట్లు, కాపు నేస్తం రూ.9.77 కోట్లు, ఈబీసీ నేస్తం రూ.11.78 కోట్లు, సున్నావడ్డీ రూ.16.98 కోట్లు, వైఎస్సార్ బీమా రూ.6.06 కోట్లు, సీఎం రిలీఫ్ ఫండ్ రూ.10.04 కోట్లు, ఎస్సీ, ఎస్టీలకు ఫ్రీ కరెంటుకు రూ.5.27 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. రూ.311.13 కోట్లతో అర్బన్ లింక్ వైడనిగ్, రూ.90 కోట్లతో గుత్తి రోడ్డు, ఎస్ క్యాప్ ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.68.72 కోట్లు, నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.49.50 కోట్లు, రూ.19 కోట్లతో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లు, రూ.41 కోట్లతో రుద్రంపేట పంచాయతీ, రూ.43 కోట్లతో ఏ నారాయణపురం, రూ.16 కోట్లతో రాజీవ్ కాలనీ, రూ.21 కోట్లతో అనంతపురం రూరల్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు అనంత చంద్రారెడ్డి, అనంత సుబ్బారెడ్డి, కూతురు నవిత, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థనారాయణ, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్లు సాకే చంద్రశేఖర్, అనిల్‌కుమార్ రెడ్డి, సంపంగి రామాంజనేయులు, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, కన్వీనర్లు చింతా సోమశేఖర్ రెడ్డి, చింతకుంట మధు, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, ఎగ్గుల శ్రీనివాసులు, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, కృష్ణవేణి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జయచంద్రనాయుడు, కాపు జేఏసీ కన్వీనర్ గుజరీ వెంకటేష్, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, అనిల్‌కుమార్ గౌడ్, వనారస బలరాం, కోనారాజారెడ్డి, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, కేవీ వెంకటరమణ, కుమార్, హనుమంతు, మన్నల సత్యానారాయణ, వైవీ శ్రీనివాస్‌రెడ్డి, జావెద్, రామయ్య, ఏ1రఫీ, సాకే కుళ్లాయస్వామి, చెన్నారెడ్డి, రామకృష్ణ,జానీ, తనీష, దాదాఖలందర్, శోభాబాయి, ఉష, పార్వతి, గౌరి, అంజలి పాల్గొన్నారు.

ముగిసిన ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నీ


సర్టిఫికెట్లు, మెడల్స్ చూపుతున్న క్రీడాకారులు

అనంతపురం: ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. రఘు సైనిక్ స్కూల్‌లో నిర్వహించిన చెస్ టోర్నమెంట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 186 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో 40 మందికి నగదు బహుమతి రూపంలో మొత్తం రూ.70 వేలు అందజేశారు. 36 ట్రోఫీలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రఘు సైనిక్ స్కూల్ డైరెక్టర్లు రాఘవేంద్ర, రామసుబ్బారెడ్డి, ఏ1 చెస్ అకాడమీ వ్యవస్థాపకురాలు అమ్మినేని తులసమ్మ, ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబువి మోసపూరిత హామీలు


ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు: అధికారం కోసం చంద్రబాబు ఇచ్చే మోసపూరిత హామీలను నమ్మకండి. అభివృద్ధి జరగాలన్నా, సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నే రావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని బి.యాలేరులో ఎన్నికల ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి జగనన్న చేసిన అభివృద్ధి, అందజేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి వివరించారు. ఈ సందర్భంగా తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయ్యాక ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. పేరూరు డ్యాంకు నీరు తీసుకొచ్చినట్లు తెలిపారు.అమ్మ డెయిరీ ఏర్పాటు చేసి, రైతులకు ఉచిత బోర్లు వేయించారన్నారు. మండలంలో శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారానికి కృషి చేశారని తెలియజేశారు. మంత్రిగా ఉన్నా పరిటాల సునీత ఏనాడు ప్రజల గురించి, నియోజకవర్గ అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. అభివృద్ధి జరగాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కన్వీనర్ లక్ష్మీనరసింహులు, ఎంపీపీ హేమలత, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బాలపోతన్న, నాయకులు వీరాంజినేయులు, ఈశ్వరరెడ్డి, సుధీర్‌రెడ్డి, మాసీ ఎంపీటీసీ శంకర్‌నారాయణరెడ్డి (చిన్నా) మహేష్, ఎర్రిస్వామి, గంగాధర్ రెడ్డి, నాగరాజు, వడ్డే ఈశ్వరయ్య, ఎంపీటీసీలు లక్ష్మీదేవి, ఓబులేష్, గోపాల్‌రెడ్డి, వెంకటేష్, పోతిరెడ్డి, శ్రీరామ్, దామోదర్‌రెడ్డి, శంకరయ్య,అతిక్‌రెడ్డి , ఈశ్వరయ్య, నరసింహారెడ్డి, నల్లప్ప, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనంతను విమర్శిస్తే ఊరుకోం

- మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: జిల్లాలో 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని మేయర్ వసీం హెచ్చరించారు. ఆదివారం మేయర్ తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని 9 నంబర్లు అంటూ మాట్లాడటం చూస్తే దగ్గుపాటికి ఏమాత్రం రాజకీయ అనుభవం ఉందో ఇట్టే తెలుస్తోందన్నారు. చంద్రబాబు, లోకేష్‌కు కోట్లు కుమ్మరించి టిక్కెట్టు తెచ్చుకున్న నీకు నగరంలో 10 డివిజన్లు ఎక్కడ వస్తాయో కూడా తెలియదని ఎద్దేవా చేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే అనంత ఎటువంటి వ్యక్తో మీ బాబాయి అనంతయ్యను అడిగి తెలుసుకోవాలని హితవు పలికారు. టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్తారన్నారు.

రూ.వేల కోట్లతో సంక్షేమం, అభివృద్ధి

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో నియోజకవర్గంలో రూ.2వేల కోట్ల సంక్షేమం, రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి నాలుగైదు సార్లు ప్రతి గడపకు ఎమ్మెల్యే వెళ్లి ప్రజల కష్ట సుఖాలను తెలుసుకున్నారన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకువచ్చి 8 రకాల స్పెషాలిటీ వైద్య సేవలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రి బలోపేతం, తదితర అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. కోవిడ్‌లో టీడీపీ నాయకులు ఇళ్లలో దాక్కుంటే ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు పరితపించారన్నారు.

నేడు 30వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 30వ డివిజన్‌లో సోమవారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అరవిందనగర్ మొదటి క్రాస్ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.